పత్రికాప్రకటన కాకినాడ, 8.11.2018

ప్రభుత్వ శాఖల ద్వారా అందిస్తున్న సేవలు, సంక్షేమాలపై మరింత ప్రజా సంతృప్తి సాధించేందు అంకితభావంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా అధికారులను ఆదేశించారు.

గురువారం సాయంత్రం రాష్ట్ర చీఫ్ సెక్రటరీ అనిల్‌చంద్రపునేత జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఆర్‌టిజిఎస్ ప్రజాసంతృప్తి స్థాయి, అంటువ్యాధుల నియంత్రణ, చుక్కల భూముల అర్జీల పరిష్కారం, గ్రామదర్శిని కార్యక్రమాల నిర్వహణ అంశాలపై సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల కనుగుణంగా అన్ని ప్రభుత్వ శాఖలు జనరంజకమైన సేవలతో 95 శాతం ప్రజల సంతృప్తిని సాధించాలని కోరారు. కొన్ని జిల్లాల్లో ఉనికి ఎక్కువగా ఉన్న స్వైన్ ఫ్లూ, డెంగ్యూ, మలేరియా వ్యాధుల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. గత నెల మాతా మరణాల సంఖ్య తగ్గడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఇదే పనితీరు కొనసాగించి మరింత కనిష్ట స్థాయికి మరణాలు తగ్గించాలని కోరారు. చుక్కల భూములకు సంబంధించి ప్రజల సమస్యల పరిష్కారాన్ని సత్వరం పూర్తి చేయాలని, అవసరమైతే నిబంధనలలో సడలింపుల కొరకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. గ్రామ దర్శిని కార్యక్రమాలలో భాగంగా గ్రామాలలో సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్, డంగ్ ఊబరైజేషన్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఎస్‌సి, బిసి, కార్పొరేషన్ల ద్వారా యువతకు చెత్తతరలింపుకు వాడే ఈ రిక్షాలను కల్పించాలని సూచించారు. పంచాయితీలలో మౌళిక సదుపాయాలు, ఆస్తులకు సంబంధించిన 105 అంశాల సమాచారాన్ని, గ్రామాభివృద్ధి ప్రణాళికలను ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని కోరారు. గ్రామదర్శిని గ్రామస్థాయి ఫంక్షనరీలలో బదిలీలు, రిటైర్‌మెంట్‌లు, ఇతర కారణాల వల్ల అవసరమైన మార్పులను జిల్లా కలెక్టర్ల స్థాయిలో జరిపేందుకు అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు.

అనంతరం జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా నియోజక వర్గ అభివృద్ధి అధికారులు, జిల్లా అధికారులతో సమావేశమై చీఫ్ సెక్రటరీ సూచించిన అంశాలను జిల్లాలో పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు. జిల్లాలో వివిధ ప్రభుత్వ సేవల పట్ల ప్రజలు వ్యక్తం చేస్తున్న సంతృప్తి స్థాయి క్రమంగా పెరుగుతోందని, జూన్ నెలలో 65 శాతంగా ఉన్న ప్రజా సంతృప్తి స్థాయి నవంబరు నెలలో 75 శాతానికి పెరిగిందన్నారు. ముఖ్యంగా సంతృప్తి స్థాయి తక్కవగా ఉన్న హౌసింగ్, చంద్రన్న సంచార చికిత్స, 108, మధ్యాహ్న భోజన పథకం, ఇసుక లభ్యత అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. కాకినాడ, పరివృత గ్రామాల్లో పారిశుధ్యం, దోమల నివారణ విస్తృతంగా చేపట్టి అంటువ్యాధుల ఉనికిని నివారించాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎ.మల్లికార్జున, జాయింట్ కలెక్టర్-2 సిహెచ్.సత్తిబాబు, రంపచోడవరం సబ్‌కలెక్టర్ డా.వి.వినోద్‌కుమార్, డిఆర్ఓ ఎస్‌విఎస్‌సుబ్బలక్ష్మి, జడ్‌పి సిఈఓ విద్యాసాగర్, సిపిఓ రత్నబాబు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

(సమాచార శాఖచే జారీ)